సాక్షి
మహబూబాబాద్

సోమవారం । 12 । జూన్ । 2023



పత్తి రైతు.. పరేషాన్ వద్దు

పత్తి రైతులు మార్కెట్‌లో వ్యాపారులు సృష్టించే గందరగోళంతో పరేషాన్ కాకుండా జాగ్రత్తగా విత్తనాలను ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. - 8లో▸



వినియోగదారుల రక్షణే ధ్యేయం

వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయమని సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.3°/27.4°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గొప్ప కవి దాశరథి



చిన్నగూడూరు: తెలంగాణ భాష, యాస, మాండలికాల్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప కవి దాశరథి అని కలెక్టర్ శశాంక అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాహితీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని దాశరథి ప్రాంగణంలో దాశరథి కృష్ణమాచార్యులు, రంగాచార్యులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. దాశరథి సోదరులు జన్మించిన గడ్డ పోరాటాన్ని ప్రజలకు తెలియజేసిందని, వారిని స్మరించుకుంటూ సాహిత్య దినోత్సవం జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తలపెంచిన సందర్భంలో వారికి నివాళులర్పించామన్నారు. వారి రచనలు సమాజానికి ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. వారి గొప్ప రచనలను చదివే బాధ్యత, కాపాడే బాధ్యత జిల్లా వాసులపై ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సహకారంతో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి దాశరథి సోదరులను స్మరించుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని దాశరథి సోదరులు జన్మించిన ఇంటి స్థలాన్ని, దాశరథి గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయం శిథిలావస్థలో ఉందని స్థానికులు కలెక్టర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కలెక్టర్ గ్రంథాలయ భవన నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమాదేవి, ఆర్డీఓ రమేష్, ఎంపీపీ వల్లూరి పద్మ వెంకట్ రెడ్డి, వైస్ ఎంపీపీ వీరన్న, సర్పంచ్ మల్లయ్య, మండల కోఆప్షన్ సభ్యులు మోసిన్ బేగ్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ శ్యాంసుందర్, బీఆర్ఎస్ నాయకులు ధారాసింగ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

13న ముగ్గుల పోటీలు

మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13న స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో ఉదయం 10గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కమిషనర్ ప్రసన్నరాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు కార్యాలయంలో లేదా మహిళా సంఘాల ఆర్పీలను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాల కోరకు సీఎల్ఆర్పీ ఉమ సెల్ నంబర్ 8106344062, సీఎల్ఆర్పీ జహేరా సెల్ నంబర్ 7330846417లో సంప్రదించాలని కోరారు.

విద్యా వ్యవస్థను పటిష్టపర్చాలి



కొత్తగూడ: ఏజెన్సీలో విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. ఉపాధ్యాయుల పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. ఆదివాసీ విద్యార్థుల ప్రాథమిక విద్యపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.

రన్‌ను విజయవంతం చేయండి

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6గంటలకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో తెలంగాణ (టుకే) రన్ నిర్వహిస్తామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

హన్మకొండ : భారతీయ జనతా పార్టీలో అనుబంధ మోర్చాల పాత్ర ప్రముఖమైందని కేంద్ర మంత్రి బీఎల్.వర్మ అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో హనుమకొండ జిల్లా బీజేపీ అనుబంధ మోర్చాల సంయుక్త సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికల సంవత్సరంలో పార్టీ గెలుపే లక్ష్యంగా కష్టపడి పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని పార్టీ అనుబంధ మోర్చాలను కోరారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పద్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి ఉన్నారు.

మోగనున్న బడి గంట

- నేటి నుంచి పాఠశాలల పున:ప్రారంభం
- బడిబాటలో విద్యార్థుల నమోదు
- పలు స్కూళ్లలో సమస్యల తిష్ట



బుక్‌స్టాల్ వద్ద నోట్‌బుక్స్, పెన్నులు కొనుగోలు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మహబూబాబాద్ అర్బన్: వేసవి సెలవుల అనంతరం సోమవారం బడి గంట మోగనుంది. విద్యార్థులు సుదీర్ఘ సెలవులు అనంతరం బడిబాట పట్టనున్నారు. కాగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. తాగునీరు, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల కొరత, డబుల్ డెస్క్ బెంచీలు సరిపడా లేవు. సమస్యల మధ్యనే విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. ఇదిలా ఉండగా కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు బ్యాగులు, పెన్నులు, నోట్‌బుక్స్‌తో పాటు కావాల్సిన ఇతర సామగ్రి కొనుగోలు చేశారు.

విద్యార్థుల నమోదు..

జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 898 ఉండగా గత సంవత్సరంలో 1,06,829 మంది విద్యార్థులు నమోదయ్యారు. కాగా నూతన విద్యా సంవత్సరంలో ఈ నెల 3వ తేదీ నుంచి బాడి బాట కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,500 విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందారు. ఉపాధ్యాయులు తండాలు, గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.

పూర్తి కాని మన ఊరు– మనబడి పనులు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో జిల్లాలోని 315 పాఠశాలలను ఎంపిక చేశారు. అయితే సంవత్సరం దాటినా ఇప్పటి వరకు 35 పాఠశాలల్లోనే అభివృద్ధి పనులు పూర్తి కాగా 19 పాఠశాలలను గతంలోనే పునఃప్రారంభించారు. మరో 16 పాఠశాలలను ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభిస్తారు. కాగా ఇంకా 280 పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇందులో కొన్నిచోట్ల ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. కాగా సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. కనీసం తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో విద్యార్థుల బాధలు వర్ణనాతీతం.

పూర్తిగా సరఫరా కాని పుస్తకాలు, నోట్‌బుక్స్..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 3,88,120 పుస్తకాలు రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 3,12,730 పుస్తకాలు వచ్చాయి. మరో 75,390 పుస్తకాలు రావాల్సి ఉంది. కాగా సరఫరా అయిన వాటిలో నుంచి 57,347పుస్తకాలను గురుకులాలకు అందజేశారు. అలాగే జిల్లాకు 2,68,444 నోట్‌బుక్స్ రావాల్సి ఉండగా 6,3425 మాత్రమే వచ్చాయి. ఇంకా 2,05,019 నోట్‌బుక్స్ పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే జిల్లాకు 65 శాతం మాత్రమే స్కూల్ యూనిఫాం కుట్టుకూలి వచ్చింది.



మానుకోటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల



జిల్లాకు చేరిన నోట్‌బుక్స్

కొనుగోళ్ల సందడి..

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల హడావుడి మొదలైంది. బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన బాక్స్‌లు, షూస్ ఇతర సామగ్రి కొనుగోలు చేస్తూ బిజీబిజీగా కనిపించారు. ఏ బుక్‌స్టాల్ చూసినా కొనుగోళ్ల సందడి కనిపించింది.

ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి



ప్రైవేటుకు దీటుగా జిల్లాలో అన్ని పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయి. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి. నాణ్యమైన విద్యతో పాటు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. పది ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాం. అన్ని ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధన జరుగుతోంది.

-పి.రామారావు, డీఈఓ

నోట్‌బుక్స్, బ్యాగులు కొనుగోలు చేశాం..



మా పాప మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. నోట్‌బుక్స్, గైడ్‌లు, పెన్నులు, బ్యాగులు కొనుగోలు చేశాం. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వేసవి సెలవులను మరో 10 రోజులు పొడిగించాలి. ప్రభుత్వం ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన విద్య అందించాలి.

-దాసరి సారయ్య, విద్యార్థిని తండ్రి, మానుకోట

రాలిన పోరాట కుసుమం



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే సీతక్క



నివాళులర్పిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి

జెడ్పీ చైర్మన్ జగదీశ్ హఠాన్మరణం

- తరలి వచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- సంతాపం తెలిపిన ప్రజాప్రతినిధులు

ములుగు: బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్(47) గుండెపోటుతో మృతిచెందారు. దీంతో కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విషాదంలో మునిగిపోయారు. హనుమకొండ స్నేహనగర్‌లోని స్వగృహంలో ఉండగా ఆదివారం ఉదయం ఆయనకు గుండెనొప్పి రావడంతో గుర్తించిన కుమారుడు వెంకట సత్యదేవ్, సోదరుడు కన్నయ్య, గన్‌మెన్ కలిసి జగదీశ్వర్‌ను లైఫ్‌లైన్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ములుగు రోడ్డులోని అజర ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతూనే తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఇదిలా ఉండగా.. గత నెలలో జగదీశ్వర్‌కు మైల్డ్ స్ట్రోక్ రావడంతో అజర ఆస్పత్రిలో వారం రోజుల చికిత్స పొందారు. అనంతరం నిర్వహించి తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. కుసుమ జగదీశ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించినట్లు ప్రచారం జరుగుతోంది.

తరలివచ్చిన పార్టీ శ్రేణులు

జెడ్పీ చైర్మన్ మృతి చెందారనే వార్త సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న పార్టీ శ్రేణులు ఆస్పత్రి వద్దకు చేరుకుని.. మృతదేహాన్ని చూసి తమ నాయకుడు ఇక లేడని కన్నీటి పర్యంతమయ్యారు. జగదీశ్వర్ మృతి విషయం పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి చెంది ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జలవనరుల సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, మాజీ మంత్రి చందూలాల్ తనయుడు అజ్మీరా ప్రహ్లాద్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి, జెడ్పీటీసీ సకినాల భవాని, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగదీశ్వర్ మృతదేహాన్ని చూసి రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కన్నీటి పర్యంతమయ్యారు. ఎమ్మెల్యే సీతక్క ఆస్పత్రికి చేరుకొని నివాళులర్పించారు. పార్థివ దేహాన్ని మల్లంపల్లి తరలించగా ఆమె వెంట వచ్చారు. వేలాదిగా వచ్చిన పార్టీ కార్యకర్తలతో మల్లంపల్లిలో విషాదం నిండుకుంది.

నేడు అంత్యక్రియలు

జగదీశ్వర్ స్వగ్రామం ములుగు మండల పరిధి మల్లంపల్లిలో అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం వరకు పార్టీ శ్రేణులు, స్థానికుల సందర్శనార్థం పార్థివ దేహాన్ని ఉంచనున్నారు.

ఉదయం రానున్న మంత్రి కేటీఆర్

ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చాపర్ ద్వారా ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకుంటారు. అక్కడి నుంచి జగదీశ్వర్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తారు. అనంతరం సీఎం ఆదేశాల మేరకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నేలకొరిగిన ఉద్యమ కిరణం

ములుగు మండలం మల్లంపల్లికి చెందిన ఆదినారాయణ–సులోచన దంపతులకు జగదీశ్వర్ నాలుగో సంతానం. ఆయనకు భార్య రమ, కుమారుడు వెంకట సత్యదేవ్, కూతురు హరిచందన ఉన్నారు. 1991లో మల్లంపల్లి పాఠశాలలో 10వ తరగతి చదివిన జగదీశ్వర్.. తొలి నుంచి తెలంగాణ ఉద్యమ కారుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. కళాశాలలో చదువుతున్న సమయంలో విశ్వ భారత్ యూత్‌ను ప్రారంభించి గుడుంబా, గుట్కా నియంత్రణపై ఉద్యమాలను మొదలు పెట్టారు. సైకిల్ యాత్ర నిర్వహించి అప్పటి సీఎం చంద్రబాబునాయుడు వరకు వెళ్లారు. 2001 తెలంగాణ ఉద్యమ సమయంలో యూత్ ఆర్గనైజేషన్‌లో పని చేయడంతో పాటు అనేక నిరసన కార్యక్రమాలను చేపట్టి కేసీఆర్ దృష్టిలో పడ్డారు. 2001కి పూర్వం విప్లవ పార్టీలో కూడా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించిన తర్వాత 2014 వరకు ఉద్యమాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సిద్ధించాక జగదీశ్వర్ సీఎం కేసీఆర్‌కు దగ్గరయ్యారు. 2019 ఆగస్టులో ములుగు జిల్లాలో జరిగిన ఎన్నికల్లో ఏటూరునాగారం నుంచి జెడ్పీటీసీగా గెలుపొందారు. అనంతరం కేసీఆర్ ఆశీర్వాదంతో జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడిగా, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు.



జగదీశ్ మృతదేహం

దిగ్భ్రాంతికి గురి చేసింది..

హన్మకొండ: ములుగు జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీశ్వర్ ఆకస్మిక మరణం దిగ్భ్రాంతికి గురి చేసింది. చిన్న వయస్సులో గుండె పోటుతో మృతి చెందడం కలచివేసింది. తెలంగాణ ఉద్యమ సహచరుడు, అత్యంత సన్నిహితుడు ఇకలేడనే బాధ కలచివేస్తోంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. జగదీశ్వర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.

- దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్

ఉద్యమ వీరుడికి జోహార్లు..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన పోరాటంలో సహచర ఉద్యమకారుడు, కుసుమ జగదీశ్వర్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన ఇక లేడనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. ఆయన మృతి బీఆర్ఎస్ పార్టీకి, ములుగు జిల్లా ప్రజలకు తీరని లోటు. ఓ మంచి మిత్రుడిని కోల్పోయాను. జగదీశ్వర్ మృతికి సంతాపం. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.

- వై.సతీష్‌రెడ్డి, టీఎస్ రెడ్‌కో చైర్మన్

పార్టీకి తీరని లోటు..

ములుగు జెడ్పీ చైర్మన్ జగదీశ్వర్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకుడి మరణం ఎంతగానో కలచివేసింది. సహచర జెడ్పీ చైర్మన్‌గా ఎన్నో ఆలోచనలు, అభిప్రాయాలు పంచుకునేవారం. ఆయన మృతికి సంతాపం.

- డాక్టర్ మారపల్లి సుధీర్‌కుమార్, వరంగల్ అర్బన్ జెడ్పీ చైర్మన్

పెండింగ్ @ 976

- ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం
- భూ సమస్యలపై వచ్చినవే ఎక్కువ
- కలెక్టర్ ఆదేశాలను లెక్కచేయని అధికారులు
- ఆశతో వచ్చి నిరాశతో వెళ్తున్న దరఖాస్తుదారులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక (ఫైల్)

మహబూబాబాద్: సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అన్ని శాఖల జిల్లా అధికారుల ఎదుటనే కలెక్టర్ స్వయంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ఇప్పటి వరకు 976 దఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. ఎక్కువగా భూ సమస్యలకు సంబంధించినవే కావడం గమనార్హం. కాగా త్వరగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ శశాంక ఆదేశించినా అధికారులు పెడచెవిన పెడుతున్నారు. సమస్య పరిష్కారం అవుతుందని ఆశగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పడం లేదు.

పెండింగ్‌లోనే..

జిల్లాలో ఈ నెల 5వ తేదీ వరకు ప్రజావాణిలో 2,9351 దరఖాస్తులు రాగా, దీనిలో 28,375 పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. వారి లెక్కల ప్రకారం ఇంకా 976 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈమేరకు దరఖాస్తు ఇచ్చిన 15రోజుల్లో సమస్య పరిష్కరించాలి. లేకపోతే కారణంతో కూడిన నివేదికను సంబంధిత అధికారులు అందజేయాలి. కాగా కలెక్టర్‌కు దరఖాస్తులు ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు ఎంతో నమ్మకంతో దూరప్రాంతాల నుంచి వస్తున్నారు. దరఖాస్తులు ఇవ్వడానికి బారులు దీరుతున్నారు. ఇచ్చిన వారిలో చాలామంది పరిష్కారం కాక పలుమార్లు వస్తూనే ఉన్నారు. ఏదో ఒకరోజు సమస్య పరిష్కారం కాకపోతుందా అనే నమ్మకంతో వస్తూనే ఉన్నారు.

కార్యాలయాల వారీగా పరిశీలిస్తే..

జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సంబంధించినవి 2,131దరఖాస్తులు రాగా దీనిలో 1,979 పరిష్కారం కాగా 152 పెండింగ్‌లో ఉన్నాయి. మానుకోట తహసీల్దార్ కార్యాలయంలో 87, సర్వే ల్యాండ్ రికార్డులు శాఖ 42, ఆర్డీఓ కార్యాలయం 40, ఎస్పీ కార్యాలయం 39, డీఆర్‌డీఏ 36, తొర్రూరు మున్సిపాలిటీలో 35 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా వివిధ శాఖల్లో కలిపి మొత్తం 976 దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మండలస్థాయిలో సమస్య పరిష్కారం కాకుంటే, కలెక్టరేట్‌కు వస్తున్నారు. కలెక్టరేట్‌లో కూడా పెండింగ్‌లో పెడితే ఎలా అని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాట లెక్కలేదా..

ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్ శశాంక నేరుగా దరఖాస్తులను స్వీకరించి సమస్య తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులకు దరఖాస్తులు అందజేసి పరిష్కరించాని ఆదేశిస్తున్నారు. కాగా ఆయా శాఖల అధికారులు దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం చూపుతూ కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలని దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎనిమిదిసార్లు వినతి ఇచ్చా..

వడ్డెర కులస్తులకు జిల్లా కేంద్రంలో శ్మశాన వాటిక కావాలని, ఫంక్షన్ హాల్‌కు స్థలం కేటాయించాలని, మిగతా సమస్యలు పరిష్కరించాలని ఎనిమిది సార్లు వినతి ఇచ్చా. పలుమార్లు సంబంధిత అధికారులకు రెఫర్ చేసినా ఫలితం లేదు. పనులు అవుతాయా.. కావా అనే విషయం కూడా చెప్పడం లేదు. కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా.

-గుంజె హన్మంతు, మానుకోట వాసి

ప్రశాంతంగా గ్రూప్–1 పరీక్ష



మహబూబాబాద్ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో గ్రూప్–1 పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ శశాంక ఆదివారం తెలిపారు. జిల్లాలోని 13 కేంద్రాల్లో 4,046 మంది అభ్యర్థులకు 2,663 మంది పరీక్షకు హాజరై 1,383 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. దీంతో 65.82 శాతం హాజరు నమోదైనట్లు కలెక్టర్ వెల్లడించారు.

కలెక్టర్ పరిశీలన..

జిల్లా కేంద్రంలోని తక్షశిల హైస్కూల్, అనంతార మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ శశాంక సందర్శించారు. పరీక్ష తీరును పరిశీలించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. కాగా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహర్షి కళాశాలలో సందర్శించారు. పరీక్ష తీరును పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు.

అనుమతి నిరాకరణ



అభ్యర్థులను అడ్డుకున్న సిబ్బంది

తొర్రూరు: గ్రూప్–1 పరీక్షకు ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా హాజరు కావడంతో సిబ్బంది అడ్డుకున్నారు. తొర్రూరు పట్టణంలోని సమతా డిగ్రీ కాలేజీ, సెయింట్‌పాల్స్ పాఠశాల, సంక్షేమ బాలికల గురుకులంలో గ్రూప్–1 పరీక్ష నిర్వహించారు. కాగా సమతా డిగ్రీ కాలేజీ కేంద్రంలో ఉదయం 10.30 గంటల తర్వాత పరీక్ష రాయడానికి వచ్చిన ఇద్దరు అభ్యర్థులను సిబ్బంది అడ్డుకున్నారు. వారికి అనుమతి నిరాకరించడంతో వెనుదిరిగి వెళ్లారు.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో నేటి నుంచి ఈ నెల 19వ తేదీవరకు ఇంటర్మీడియన్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డీఐఈఓ సమ్మెట సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30నుంచి సాయత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రథమ సంవత్సరంలో 2,704 మంది, ద్వితీయ సంవత్సరంలో 1,644 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. విద్యార్థులు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ నుంచి హాల్ టికెట్లు పొందాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రతి పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించామన్నారు. నిమిషం నిబంధన అమలులో ఉంటుందన్నారు.

గోవులను పరిరక్షించుకోవాలి

తొర్రూరు రూరల్: గోవులను పరిరక్షించుకోవాలని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. మండలంలోని జీకే తండాలో సోమేశ్వర గో సంరక్షణ సేవా సంఘం ఆధ్వర్యంలో 10 మంది రైతులకు ఉచితంగా లేగ దూడలను పంపిణీ చేశారు. మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ.. దేశ సంస్కృతిలో గోవుకు కీలక పాత్ర ఉందన్నారు. గో సంరక్షకులకు అన్ని పార్టీలు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గోశాల అధ్యక్షుడు అజ్మీరా సంతోష్, జీకే తండా సర్పంచ్ బానోతు అచ్చమ్మ, లకావత్ భాస్కర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.



జీకే తండాలో మహిళా రైతుకు లేగదూడను పంపిణీ చేస్తున్న గో సంరక్షణ ప్రతినిధులు

కొండెక్కిన కోడి



దోర్నకల్‌లోని చికెన్ దుకాణం

దోర్నకల్: చికెన్ ధరలు కొండెక్కాయి. రికార్డుస్థాయిలో కేజీ ధర రూ.300 దాటింది. వరుసగా శుభకార్యాలు, తీవ్రమైన ఎండలతో చికెన్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రముఖ కంపెనీలకు చెందిన కోళ్ల ఫారాలలో కోళ్లు ఎండలకు తట్టుకునేలా ఏసీలను ఏర్పాటు చేస్తున్నారని, దీంతో చికెన్ ధరలు అమాంతం పెరుగుతున్నాయని దుకాణదారులు చెబుతున్నారు. చికెన్ కేజీ ధర రూ.300, స్కిన్‌లెస్ ధర రూ.320 ఉండడంతో సామాన్యులు కొనుగోలు చేసి తినలేకపోతున్నారు.

క్లుప్తంగా

పలుగులలో యువకుడి ఆత్మహత్య

- చనిపోయే ముందు స్నేహితుడికి వీడియో కాల్‌


రాజయ్య (ఫైల్‌)

కాళేశ్వరం : తాను చనిపోతున్నానని ఓ యువకుడు స్నేహితుడికి వీడియోకాల్‌ చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలం పలుగులలో జరిగింది. ఎస్సై లక్ష్మణ్‌రావు కథనం ప్రకారం రెండు రోజుల నుంచి ముత్యాల రాజయ్య(27) మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు. దీంతో అతని భార్య మానస రోజు ఎందుకు సేవిస్తున్నావని ప్రశ్నించగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో రాజయ్య ఆదివారం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు వెళ్లాడు. సాయంత్రం వచ్చి గ్రామంలోని తన స్నేహితుడు మానెం సాగర్‌కు సెల్ఫీ వీడియోకాల్‌ చేసి తాను చనిపోతున్నానని పురుగుల మందు తాగాడు. అనంతరం ఇంటికి వచ్చి కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు మహదేవపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. దీనిపై మృతుడి సోదరుడు ముత్యాల సంపత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్య

వరంగల్‌ క్రైం: సుబేదారి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని వికాస్‌నగర్‌కు చెందిన పల్లె శ్యామల (42) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. రెండు నెలల క్రితం పెద్ద కూతురు ప్రేమ వివాహం చేసుకున్నప్పటి నుంచి మానసికంగా కుంగిపోయింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిందని ఇన్‌స్పెక్టర్‌ షూకుర్‌ తెలిపారు. ఘటనపై మృతురాలి భర్త పల్లె శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇనుగుర్తిలో రైతు..


శ్యామ్‌ మృతదేహం

కేసముద్రం: పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం ఇనుగుర్తి మండల కేంద్రంలో జరిగింది. స్థానికులల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సంగెం శ్యామ్‌(35) ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలిస్తూ, తమ పంటచేను వద్దకు వెళ్లారు. అక్కడ పురుగుల మందు తాగి శ్యామ్‌ ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. ఎస్సై తిరుపతిని వివరణ కోరగా ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.


దుగ్గొండి: పత్తి అచ్చుతోలుతున్న రైతులు (ఫైల్‌)


పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు (ఫైల్‌)

పత్తి రైతు.. పరేషాన్‌ వద్దు

- వ్యాపారులు సృష్టించే గందరగోళంతో మోసపోవద్దు
- సాగులో విత్తన ఎంపిక కీలకం
- అదను..పదను చూసుకోవాలి
- జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్‌

దుగ్గొండి : అన్నదాతలు ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్నారు. మండుటెండలోనూ మాడ మండుతున్నా దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. సకాలంలో వరుణుడు కరుణిస్తే విత్తనం నాటేందుకు రెడీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ సాగులో విత్తన ఎంపిక చాలా కీలకం. ఇక్కడే రైతు జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం ఏమురుపాటున్న పంట మొత్తం నష్టపోయి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో వ్యాపారులు సృష్టించే గందరగోళంతో రైతులు పరేషాన్‌ కావొద్దని జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్‌ పేర్కొన్నారు. వానాకాలం సీజన్‌లో పత్తి విత్తనాలు నాటడం, విత్తనాల ఎంపికపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

తేమ లేకుండా విత్తనాలు నాటొద్దు..

పత్తిపంటను వర్షాధారంగా గాని, నీటి పారుదల కిందగాని సాగు చేయొచ్చు. నేలను పలుమార్లు లోతుకు దున్ని అందులో పశువుల ఎరువుగాని, కోడి ఎరువుగాని వేయాలి. 60–65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అనంతరం పత్తి విత్తనాలు నాటుకోవాలి. తేమ లేకుండా విత్తనాలు నాటితే సరిగ్గా మొలకెత్తవు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. భాస్వరం ఎరువులను నేలలోనే వేసుకోవాలి.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు..

రైతులు పత్తి విత్తనాలను జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలి. గత 2–3 సంవత్సరాల కాలంలో తమ ప్రాంతంలో ఏ రకం విత్తనాలు అధిక దిగుబడులు ఇచ్చాయో వాటినే ఎంపిక చేసుకోవాలి. విత్తన లైసెన్స్‌లు ఉన్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి. బిల్లు తీసుకోవాలి. బిల్లులో విత్తన వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలి. పంట చేతికి వచ్చే వరకూ బిల్లును దాచిపెట్టుకోవాలి. లూజు, గుడ్డ సంచులలో వచ్చే విత్తనాలను కొనుగోలు చేయొద్దు. వీటిని ఎవరైనా అమ్మితే వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. విత్తన ప్యాకెట్‌పై ఉన్న క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేస్తే పూర్తి వివరాలు వస్తాయి. వాటిని పరిశీలించాలి.

అంతర పంటల సాగు...

పత్తిలో అంతర పంటలుగా పెసర, మినుము, కంది సాగు చేసుకోవాలి. అంతర సాగు వల్ల పంటకు పెనుబంక, తెల్లదోమ, పచ్చదోమ ఉధృతి ఉండదు.

అధిక సాంద్రత సాగు.. దిగుబడి బాగు..

పత్తిని అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తే దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. సాధారణ అచ్చులోనే సాలు పద్ధతిలో విత్తనాలు దగ్గరగా వేయాలి. ఎకరాకు 4 నుంచి 5 ప్యాకెట్లు విత్తుకోవాలి. 25 వేల నుంచి 33 వేల మొక్కలు ఉండేలా చూసుకోవాలి. 40–45 రోజుల వయసులో ‘చమత్కార్‌’ మందును పిచికారీ చేయడం వల్ల పెరుగుదలను నియంత్రించడంతో పాటు పంట ఒకేసారి కాపుకు వస్తుంది. కాయలన్నీ ఒకేసారి పగిలి పంట మొత్తం ఒకేసారి చేతికి వస్తుంది. సాధారణ పద్ధతిలో కన్నా 50 శాతం అధిక దిగుబడి వస్తుంది. రెండో పంట వేసుకోవడానికి అనుకూలంగా ఉండటంతో పాటు గులాబీరంగు పురుగు బెడద ఉండదు.

పొట్టలో పెరిటోనియల్‌ ఫ్లూయిడ్‌..

- శ్వాసకు తీవ్ర ఇబ్బంది
- ప్రాణాపాయ స్థితిలో వ్యక్తి
- కాపాడిన గార్ల సీహెచ్‌సీ వైద్యుడు


ఫ్లూయిడ్‌ తీస్తున్న వైద్యుడు

గార్ల: పెరిటోనియల్‌ ఫ్లూయిడ్‌తో ఏడాది నుంచి ఓ వ్యక్తికి పొట్ట ఉబ్బి శ్వాస తీసుకోవడం ఇబ్బంది కలుగుతోంది. దీంతో సదురు వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో కొట్టిమిట్టాడుతున్నాడు. ఈ క్రమంలో చికిత్స చేసి ఆయనను గార్ల సీహెచ్‌సీ వైద్యుడు కాపాడాడు. ఈ ఘటనకు సబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గార్ల మండలం సూర్యాతండాకు చెందిన బానోత్‌ జేత్రాం గత ఏడాది నుంచి పొట్ట ఉబ్బుతోంది. దీంతో ఖమ్మంలోని ఓ కార్పొరేట్‌ ఆస్పత్రిలో రూ.2 లక్షలు ఖర్చు చేసి వైద్యం చేయించుకున్నా ఉబ్బరం తగ్గలేదు. ఈ క్రమంలో ఆదివారం ఫ్లూయిడ్‌తో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండడంతో కుటుంబ సభ్యులు వెంటనే గార్ల సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. డ్యూటీలో ఉన్న డాక్టర్‌ రాజ్‌కుమార్‌ జాదవ్‌.. జేత్రాం పొట్ట నుంచి సుమారు 5 లీటర్ల మేర పెరిటోనియల్‌ ఫ్లూయిడ్‌ తీయడంతో ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడింది. దీంతో కార్పొరేట్‌ ఆస్పత్రిలో రూ.2 లక్షలు ఖర్చు చేసినా తగ్గని జబ్బును డాక్టర్‌ రాజ్‌కుమార్‌ తగ్గించడంతో తండా వాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రాజ్‌కుమార్‌ మాట్లాడుతూ రోగులు అనవసరంగా కార్పొరేట్‌ ఆస్పత్రుల చుట్టూ తిరిగి డబ్బు వృథా చేసుకోవద్దని, ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరి వైద్యం పొందాలన్నారు.

కొడుకు అంత్యక్రియలకు.. జైలు నుంచి వచ్చిన తండ్రి


గణపతిని ఓదార్చుతున్న గ్రామస్తులు

వాజేడు: కొడుకు అంత్యక్రియలు పూర్తి చేయడానికి ఆయన తండ్రి ప్రత్యేక భద్రత మధ్య ఆదివారం జైలు నుంచి వచ్చాడు. మండలంలోని గుమ్మడి దొడ్డి గ్రామానికి చెందిన కంబాలపల్లి సాయి తరుణ్‌(21) ఏటూర్‌నాగారం మండల కేంద్రంలోని హైవే స్ట్రీట్‌ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, సాయితరుణ్‌ తండ్రి గణపతిని మావోయిస్టులకు కొరియర్‌గా పని చేస్తున్నాడని పోలీసులు ఇటీవల అరెస్టు చేసి రిమాండ్‌పై ఖమ్మం జైలుకు తరలించారు. సాయి తరుణ్‌ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని పోలీసులు.. గణపతికి తెలిపి అంత్యక్రియల నిమిత్తం ఆయనను భారీ భద్రతతో గుమ్మడి దొడ్డి గ్రామానికి పంపించారు. కొడుకు మృతదేహాన్ని చూసిన గణపతి బోరున విలపించారు. అంత్యక్రియల అనంతరం గణపతిని పోలీసులు ఖమ్మం తరలించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింత మృతి..

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన
- వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌


నేహ (ఫైల్‌)


ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

నెహ్రూసెంటర్‌ : మానుకోట ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో ఓ బాలింత మృతి చెందింది. ఈ ఘటన శనివారం రాత్రి జరిగింది. మృతురాలి భర్త అనిల్‌ కథనం ప్రకారం మహబూబాబాద్‌ జిల్లా బయ్యారం మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన మందుల అనిల్‌ తన భార్య నేహ(27)ను మొదటికాన్పు నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చాడు. డెలివరీ చేయగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెకు అనారోగ్యంగా ఉందని వైద్యులు చికిత్స అందించారు. సెలెన్‌ స్పీడ్‌గా ఎక్కించడంతో నేహకు చెమటలు వస్తున్నాయని చెప్పగా వైద్యులు, సిబ్బంది ఎవరూ స్పందించలేదు. కొద్ది సమయం తరువాత వైద్యులు వచ్చి వేరే వార్డుకు తీసుకెళ్లి మళ్లీ తీసుకువచ్చారు. అనంతరం నేహ మృతిచెందినట్లు చెప్పారు. దీనిపై వివరణ అడిగితే వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో నేహ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆదివారం ఆస్పత్రి గేట్‌ ఎదుట మృతురాలి భర్త, బంధువులు ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకున్న టౌన్‌, బయ్యారం సీఐలు సతీష్‌, బాలాజీ, టౌన్‌ ఎస్సై రవి.. ఆందోళనకారులకు నచ్చచెప్పి పంపించారు. అనంతరం మృతిరాలి భర్త అనిల్‌ ఫిర్యాదు మేరకు వైద్యులపై కేసు నమోదుచేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

కురవి: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు(78) మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రం శివారులోని నర్సరీ వద్ద 365 జాతీయ రహదారిపై జరిగింది. కురవి నుంచి మహబూబాబాద్‌ వైపు 365 జాతీయ రహదారి పక్క నుంచి గుర్తు తెలియని వృద్ధుడు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌ వెంకన్న 100కు డయల్‌ చేసి సమాచారం అందచేశారు.

వినియోగదారుల రక్షణే సీసీఐ ధ్యేయం

- రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌


ఐడీ కార్డులు అందజేస్తున్న సుదర్శన్‌

ఖిలా వరంగల్‌: వినియోగదారుల హక్కుల పరిరక్షణే కన్యూస్యూమర్‌ కాన్సిడరేషన్‌ ఆఫ్‌ ఇండియా (సీసీఐ) ధ్యేయమని సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్‌ అన్నారు. ఆదివారం వరంగల్‌ శివనగర్‌లోని జిల్లా వినియోగదారుల సమాఖ్య కార్యాలయంలో కార్తీక్‌ అధ్యక్షతన వినియోగదారుల ఉమ్మడి జిల్లా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో బీ.ఐ.ఎస్‌, ఆహార భద్రత, డైరెక్టరేట్‌ ఆఫ్‌ ఫార్మసీ, రాష్ట్రాల లీగల్‌ మెట్రోలోజి, ఆహార కల్తీ, నిరోధక శాఖ తదితర శాఖలు వినియోగదారుల రక్షణ నిమిత్తం పనిచేస్తాయని వివరించారు. సేకరించిన వినియోగదారుల సమస్యలను కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీకి ఫిర్యాదు చేసే అవకాశం కల్పించిన సీసీఐ జాతీయ నేత డాక్టర్‌ అనంత శర్మ, డాక్టర్‌ అరుణ్‌కుమార్‌, దేవేంద్ర తివారీ, ప్రీతి పాండ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ధరణి పోర్టల్‌ వ్యవహారంపై 5 ముఖ్యమైన అంశాలపై ఫిర్యాదు చేశామని తెలిపారు. నూతనంగా సీసీఐ కార్డులు పొందే సభ్యులు జిల్లాలోని మొత్తం 3లక్షల ఫిర్యాదుల వివరాలు సేకరించి అందజేయాలని సూచించారు. ఆతర్వాత వినియోగదారుల జిల్లా కమిటీ సభ్యులకు సీసీఐ ఐడీ కార్డులను ఆయన అందజేశారు. ఈ సమావేశంలో మురారిశెట్టి యశ్వంత్‌కుమార్‌, త్రిపురోజు రవికుమార్‌, రాగి శ్రీనివాస్‌, ఆల్లాది వీరభద్రయ్య, మురహరికార్తీక్‌, జంపాల ప్రభాకర్‌, ముస్కుల కిరణ్‌కుమార్‌, తిరుమల గిరి వెంకటరమణరావు, చిలగాని నరహరి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి తీవ్రగాయాలు

జనగామ రూరల్‌: ఇంటి ఎదుట పడుకొని ఉన్న ఓ మహిళతోపాటు 10మందికిపైగా జనాలపై వీధి కుక్కలు దాడి చేసి త్రీవంగా గాయపర్చాయి. ఈసంఘటన జనగామ మండలంలోని ఎల్లంల గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలోని దేవునూరి యాదమ్మ శనివారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా కుక్కలు ఒక్కసారిగా ఒకదాని తర్వాత మరోటి ముఖంపై దాడి చేయగా దవడ, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు తెల్లవారు జామున 3గంటలకు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. యాదమ్మతోపాటు గ్రామంలోని ఓ రెండేళ్ల బాలికపై కూడా కుక్కలు దాడిచేసి చెవి భాగంగా తీవ్రంగా గాయపర్చడంతో మెరుగైన చికిత్సనిమిత్తం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. గ్రామంలోని మచ్చ రాజు, ఎదునూరి సోమయ్యలకు సైతం తీవ్రంగా గాయాలయ్యాయి. గతంలో కుక్కల బెడద ఉందని స్థానిక ప్రజాప్రతినిధులకు తెలపగా రెండు మూడు కుక్కలను పట్టుకుని.. చేతులు దులుపుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు.

రామన్నపేటలో చోరీ..?

రామన్నపేట : వరంగల్‌ రామన్నపేట ఆర్‌ఎన్‌టీ రోడ్డులోని ఓ అపార్టుమెంట్‌లో భారీ చోరీ జరిగినట్లు ఆదివారం వాట్సాప్‌లో వైరలైంది. ఓ బంగారు షాపు యజమాని ఇంట్లో సుమారు రూ. 24లక్షల నగదు, కొంత వెండి చోరీ జరిగినట్లు తెలుస్తోంది. ఆ యజమాని 6వ తేదీన ఊరు వెళ్లాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు చోరీకి పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.



అందాల సీతాకోక చిలుక..

కొత్తగూడ: అరుదైన అందమైన సీతాకోక చిలుక మండల కేంద్రంలోని దేవర రాము ఇంటి వద్ద కనువిందు చేసింది. సుమారు అయిదు ఇంచుల పొడవు నాలుగు ఇంచుల వెడల్పుతో తెల్లటి రంగు, దానిపై నాలుగు కళ్ల ముద్రలతో అందగా ఉన్న సీతాకోక చిలుకను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

ప్రయాణికుల చెంతకు ఆర్టీసీ సేవలు

- గ్రామాలకు బస్‌ ఆఫీసర్లు
- వరంగల్‌ రీజియన్‌లో 165 మంది నియామకం
- 165 గ్రామాల్లో వీరి సేవలు


విలేజీ బస్‌ ఆఫీసర్స్‌ (ఫైల్‌)

హన్మకొండ: ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు యాజమాన్యం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సంస్థ సేవలను గ్రామాల ముంగిటికి తీసుకెళ్లేందుకు విలేజీ ఆఫీసర్లను నియమించింది. వీరు గ్రామాలకు చేరుకుని ఆర్టీసీ అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యం తీసుకువస్తారు. సంస్థ పరంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని యాజమాన్యం దృష్టికి తీసుకువస్తారు. ఈ మేరకు వరంగల్‌ రీజియన్‌లో 165 మంది విలేజి బస్‌ ఆఫీసర్లను నియమించారు. వీరు రీజియన్‌లోని 165 గ్రామాల్లో సేవలు అందిస్తారు. పెద్ద గ్రామాలైతే ఒకరు, చిన్న గ్రామాలైతే రెండు, మూడింటికి కలిపి ఒక ఆఫీసర్‌ను నియమించారు. వీరు శుక్రవారం లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు.

ప్రయాణికులకు, ఆర్టీసీ వారధిగా..

- సంస్థకు.. ప్రయాణికులకు మధ్య విలేజి బస్‌ ఆఫీసర్స్‌ వారధిగా పని చేస్తారు.
- వీరికి కేటాయించిన ప్రతి గ్రామంలో ప్రతినెలా రెండు సార్లు గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేస్తారు.
- వారి అవసరాలు, సమస్యలు తెలుసుకుని డిపో మేనేజర్‌ దృష్టికి తీసుకెళ్లి తీసుకున్న చర్యలను తిరిగి గ్రామస్తులకు వివరిస్తారు.
- ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం, సుఖవంతం, క్షేమంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చని చైతన్యం కల్పిస్తారు.

డిపో వారీగా వివరాలు...

డిపో	విలేజీ బస్‌ ఆఫీసర్స్‌	కేటాయించిన గ్రామాల సంఖ్య
హనుమకొండ	16	48
జనగామ	10	34
వరంగల్‌-1	14	61
వరంగల్‌-2	19	19
మహబూబాబాద్‌	12	12
నర్సంపేట	24	46
పరకాల	21	24
తొర్రూరు	28	68
భూపాలపల్లి	21	21

- గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సంఘ పెద్దలు, మహిళ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల ఫోన్‌నంబర్లు తీసుకోవడంతోపాటు వీరి నంబర్లు ఇస్తారు.
- గ్రామాల్లో జరిగే పెళ్లిళ్లు, జాతరలు, శుభకార్యాలు తెలుసుకుంటూ వారు అద్దెకు ఆర్టీసీ బస్సులు తీసుకునేలా అవగాహన కల్పిస్తారు.
- సంస్థ అందిస్తున్న రాయితీ పథకాలను వివరించి వాటిని సద్వినియోగం చేసుకునేలా చూస్తారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


అశోక్‌(ఫైల్‌)

వాజేడు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు ఆదివారం మృతి చెందాడు. మండలంలోని గుమ్మడి దొడ్డి గ్రామానికి చెందిన నాంపల్లి అశోక్‌(23) ఛత్తీస్‌గఢ్‌లో బైక్‌ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఛత్తీస్‌ గఢ్‌ నుంచి ఇంటికి వస్తుండగా చందూర్‌-దుద్దేడ సమీపంలో బైక్‌కు అడవి జంతువు అడ్డు వచ్చింది. దానిని తప్పించే క్రమంలో బైక్‌ కింద పడింది. దీంతో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తానే 108 అంబులెన్స్‌కు ఫోన్‌ చేసి సమాచారం అందించగా వారు ఏటూర్‌ నాగారం సివిల్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కక చికిత్స పొందుతూ అశోక్‌ మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

నర్సంపేటలో డిగ్రీ విద్యార్థి..


ఇమ్రాన్‌ మృతదేహం

గీసుకొండ: డబ్బు చెల్లించాలని స్నేహితులు వేధించడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వరంగల్‌ జిల్లా నర్సంపేటకు చెందిన ఎస్‌కే ఇమ్రాన్‌ (19) హన్మకొండలోని వాగ్దేవి కళాశాలలో డిగ్రీ సెకండ్‌ ఇయర్‌ చదువుతున్నాడు. హన్మకొండలోనే అఖిల్‌, కల్యాణ్‌, నవీన్‌ అనే ముగ్గురితో కలిసి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. రెండు నెలల క్రితం ఇమ్రాన్‌కు రూ. 1.50 లక్షలు ఇచ్చామని, చెల్లించాలని ఆ ముగ్గురు..ఇమ్రాన్‌ లాప్‌టాప్‌, ద్విచక్ర వాహనాన్ని లాక్కున్నారు. విషయం తెలిసిన అతడి తల్లి వారికి డబ్బు చెల్లించి బైక్‌, లాప్‌టాప్‌ను తీసుకుని కుమారుడికి ఇచ్చింది. ఇది జరిగిన తర్వాత కూడా ఇమ్రాన్‌ను తమకు డబ్బు ఇంకా చెల్లించాలని, లేదంటే చనిపో అంటూ వేధించేవారు. శనివారం హాల్‌ టికెట్‌ తీసుకుని వస్తానని ఇమ్రాన్‌ బైక్‌పై వెళ్లగా లాక్కున్నారు. దీంతో హన్మకొండ నుంచి నర్సంపేటకు బస్సులో వెళుతున్న క్రమంలో ఇమ్రాన్‌ మార్గ మధ్యలో కొమ్మాల సింహద్వారం వద్ద దిగాడు. అనంతరం కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సమీపంలో మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. అనంతరం నర్సంపేటకు వెళ్లి తన తల్లికి విషయం చెప్పడంతో వెంటనే అతడిని నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం వరంగల్‌ ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. ముగ్గురు స్నేహితుల వేధింపులతోనే ఇమ్రాన్‌ ఆత్మహత్య చేసుకున్నాడని, వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తాత ఎండీ యాకూబ్‌అలీ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని గీసుకొండ ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెల మృత్యువాత


గేదెలను పరిశీలిస్తున్న సర్పంచ్‌, బాధితులు

నెల్లికుదురు : విద్యుదాఘాతంతో నాలుగు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన ఆదివారం మండలంలోని మునిగలవీడులో జరిగింది. గ్రామానికి చెందిన కొమ్మనబోయిన మల్లయ్య, రాజు, జంపాల ముఖేశ్‌, ఉప్పరబోయిన రాములు పాడి గేదెలు గ్రామ శివారులో వ్యవసాయ పొలాల్లో మేస్తున్నాయి. ఈక్రమంలో శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు తెగిపడిన 11కేవి విద్యుత్‌ తీగలకు తగిలి నాలుగు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్‌ నవీన్‌రావు విద్యుత్‌ అధికారులు, పశువైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

తగ్గని వేసవి తీవ్రత

- నేటినుంచి రెండు పూటల బడులు
- ఎండలతో విద్యార్థులకు ఇబ్బందులే..

విద్యారణ్యపురి : వేసవి తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు ఉక్కపోతతో సతమతమవుతున్నారు. ఈక్రమంలో సోమవారం నుంచి అన్ని యాజమాన్యాల పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపేందుకు సిద్ధం అయ్యారు. కానీ, ఉష్ణోగ్రతలూఇలాగే ఉంటే పిల్లలను పాఠశాలలకు పంపుతారా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఒకవేళ పాఠశాలలకు పంపినా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే పిల్లలు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వాటర్‌ బాటిల్స్‌ను పంపించాలి. ఎండలను దృష్టిలో ఉంచుకొని వారం రోజుల పాటు ఒక్క పూటబడి నిర్వహిస్తే బాగుంటుందనేది అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీలో ఒక్కపూట బడులు కొనసాగించేందుకు అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ, తెలంగాణలో మాత్రం రెండు పూటల బడులు కొనసాగుతాయని విద్యాశాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. హనుమకొండ జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు సోమవారం నుంచి రెండు పూటలు యథావిధిగానే నడుస్తాయని డీఈవో ఎండీ.అబ్దుల్‌హై ఆదివారం తెలిపారు.